
క్లుప్తంగా

పాత శివాలయంలో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానం (పాత శివాలయం)లో మహాశివరాత్రి మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. పరమేశ్వరుడికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు. ఉత్సవమూర్తులకు తిరుంజనం నిర్వహించి స్వామి వారిని పెళ్లి కుమారుడిగా, అమ్మవారిని పెళ్లి కుమార్తెగా అలంకరించారు. సాయంత్రం ధ్వజారోహణం చేశారు. శ్రీ కన్యకాపరమేశ్వరి అన్నసత్రం కమిటీ ప్రముఖులు జగన్మోహన గుప్తా, ఆలయ ఈఓ హేమలతాదేవి స్వామి వారికి నూతన వస్త్రాలు సమర్పించి పూజలు నిర్వహించారు. వీరభద్రుడికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు జరిగాయి. కార్యక్రమాలను ఈఓ ఎస్.హేమలతాదేవి పర్యవేక్షించారు.

రాష్ట్రంలో విద్యారంగానికి పెద్ద పీట



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో విద్యారంగానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్ద పీట వేస్తున్నారని 37వ డివిజన్ కార్పొరేటర్ మండేపూడి చటర్జీ అన్నారు. వైఎస్సార్ సీపీ నగర అధికార ప్రతినిధి మనోజ్ కొఠారి ఆధ్వర్యంలో గాంధీజీ నగరపాలకసంస్థ హైస్కూల్లోని ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతుల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నిమిత్తం స్టీల్ పళ్లాలు, గ్లాసులను గురువారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అత్యున్నత స్థాయికి ఎదగడానికి జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. అద్భుత సంస్కరణలకు శ్రీకారం చుట్టి దేశంలోనే ఆదర్శవంతంగా విద్యారంగాన్ని తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో భాస్కర్, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులు బాధ్యతతో పని చేయాలి



పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): పారిశుద్ధ్య కార్మికులు బాధ్యతతో పని చేయాలని 56వ డివిజన్ కార్పొరేటర్ చలపతిరావు పేర్కొన్నారు. పాత ఆర్‌ఆర్‌పేటలో ఆధునికరించిన శానిటరీ కా ర్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు రభానీ, వాసా బాబు, సుబ్రహ్మణ్యేశ్వరరావు, స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగారావు, 34వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణరావు పాల్గొన్నారు.

19న ఇఫ్టూ నగరశాఖ మహాసభ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఇఫ్టూ) విజయవాడ నగర శాఖ ఐదో మహాసభ ఈ నెల 19వ తేదీన బాలోత్సవ భవనంలో జరుగుతుందని ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. గురువారం గాంధీనగర్ ప్రెస్ క్లబ్‌లో ఇఫ్టూ నగర శాఖ ఐదో మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇఫ్టూ నగర అధ్యక్షుడు కె. రవీంద్ర, ఆర్.కనకరావు, నాని, టి. శ్రీను, సురేష్ ఎన్. శ్రీను, సలీం, బెనర్జీ, తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు


1.40 లక్షల విలువైన బంగారం, వెండి స్వాధీనం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగరంలోని ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక ఇంట్లో ఈ నెల 14వ తేదీన జరిగిన చోరీ కేసులో పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి అతని నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యల్లాప్రగడ సత్యనారాయణ కొరియర్ ఆఫీస్‌లో గుమాస్తా. అతను భార్య రమాదేవితో కలసి పూర్ణానందపేటలో నివసిస్తున్నారు. వారు ఈ నెల 14న రాత్రి 7 గంటలకు ఇంటికి తాళం వేసి దేవాలయానికి వెళ్లారు. తిరిగి 8.30 గంటలకు రాగా ఇంటి తాళాలు పగలకొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా బీరువా తాళం తెరచి ఉంది. అందులో ఉండాల్సిన బంగారం, వెండి వస్తువులు కనిపించలేదు. దీనిపై పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో పూర్ణానందంపేట, లక్ష్మణరావువీధిలో నివసించే ధూపాటి వెంకటకృష్ణ అలియాస్ కృష్ణ(29) నేరానికి పాల్పడినట్లు నిర్ధారించుకున్నారు. గురువారం నిందితుడు కాళేశ్వరరావు మార్కెట్ వద్ద చోరీ సొత్తు విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 1.40 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.

• శివాలయాల ముస్తాబు



పాత శివాలయం గోపురాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది



విద్యుత్ దీపాల వెలుగులో పరమేశ్వరుడు



ఉభయ రామలింగేశ్వరస్వామి ఆలయానికి విద్యుత్ అలంకరణ

మహాశివరాత్రి వేడుకలకు ‘పశ్చిమ’లోని శివాలయాలు ముస్తాబవుతున్నాయి. మందిరాలను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. గోపురాలను రంగులతో తీర్చిదిద్దారు. ఈనెల 18వ తేదీ మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ఆలయ కమిటీలు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాయి. మల్లేశ్వరస్వామి, పాత శివాలయం, విజయేశ్వరస్వామి ఆలయం, బుద్దువారి గుడిలో సర్వం సిద్ధం చేస్తున్నారు. మధురానగర్‌లోని ఉభయ రామలింగేశ్వరస్వామివారి దేవాలయం, అయోధ్యనగర్‌లోని శ్రీ దత్తసాయి శివకామేశ్వరీపీఠం, ముత్యాలంపాడులోని శ్రీపార్వతీసమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయం, సత్యనారాయణపురం రైల్వేకాలనీలోని శివకేశవ ఆలయాలను అలంకరించారు.

–వన్‌టౌన్(విజయవాడపశ్చిమ)

ఇన్సూరెన్స్ రంగంలో విద్యార్థులకు అవకాశాలు



మాట్లాడుతున్న శ్రీనాథ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇన్సూరెన్స్ రంగంలో అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ గుడివాడ శాఖ ఆపరేటింగ్ ఆఫీసర్ శ్రీనాథ్ అన్నారు. కేబీఎన్ పీజీ కళాశాల మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యాన ‘ఇన్సూరెన్స్ రంగంలో ఎంబీఏ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు’ అంశంపై సదస్సును గురువారం ఆ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించారు. శ్రీనాథ్ మాట్లాడుతూ ప్రైవేట్ రంగంలో ఏర్పాటు చేసే ఇన్సూరెన్స్ కంపెనీలు కేంద్ర ప్రభుత్వ నియంత్రణలోనే పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి వ్యక్తి ఇన్సూరెన్స్ తీసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. విద్యార్థులు ఈ రంగంలో అంశాలపై పట్టు సాధించాలని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు వివిధ రంగాల్లో వస్తున్న మార్పులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్స్ డాక్టర్ వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, పీజీ విభాగాధిపతి ఎస్ వెంకటేష్, అధ్యాపకులు ప్రభాకర్, రవికిరణ్ పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో మెరుగైన సేవలు

జేసీ శ్రీవాస్‌నుపూర్ అజయ్



సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న జేసీ శ్రీవాస్‌నుపూర్ అజయ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జాయింట్ కలెక్టర్ శ్రీవాస్‌నుపూర్ అజయ్ కుమార్ అన్నారు. అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. గురువారం నగరంలోని అయ్యప్ప నగర్, అశోక నగర్, గురునానక్ నగర్ సచివాలయాలను జాయింట్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వార్డు సచివాలయ పరిధిలో ప్రజల నుంచి అందే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను సకాలంలో లబ్ధిదారులకు అందించడానికి సచివాలయ సిబ్బంది. విధులు నిర్వర్తించాలని చెప్పారు. సచివాలయంలో సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్, ఉద్యోగుల మూమెంట్ రిజిస్టర్, సంక్షేమ పథకాల క్యాలెండర్, ఎస్ఎల్ఏ గడువులోగా ప్రజా సమస్యల పరిష్కార చర్యల నివేదిక, ప్రభుత్వ పథకాల పోస్టర్లు తదితర వాటిని జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్ పరిశీలించారు. ఇప్పటివరకు సచివాలయాలకు వచ్చిన సమస్యలు, పరిష్కరించిన వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయాల పరిసరాల్లో పచ్చదనాన్ని పెంచుతూ పరిశుభ్రతను పాటించాలన్నారు.

ఎస్‌ఆర్‌ఆర్ విద్యార్థికి అభినందన



జాతీయ త్రైక్వాండో పోటీలకు ఎంపికైన దుర్గాప్రసాద్‌తో ఎస్‌ఆర్‌ఆర్ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి

మధురానగర్(విజయవాడసెంట్రల్): కాకినాడలో జరిగిన స్టేట్‌మీట్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల విద్యార్థి దుర్గాప్రసాద్ ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ తైక్వాండో పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో వ్యాయామ విద్య విభాగం ఆధ్వర్యాన దుర్గాప్రసాద్‌ను సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థి 58 – 63 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించడం కళాశాలకే గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో వ్యాయామ విద్య విభాగాధిపతి డాక్టర్ ఎం.కోటేశ్వరరావు, డాక్టర్ డి. యుగంధర్ కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని దుర్గాప్రసాద్‌ను అభినందించారు.

పట్టుదలతో సాగితే విజయం సొంతం



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు పట్టుదలతో ముందుకు సాగితే విజయం సొంతమవుతుందని కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల యువజన సర్వీసుల శాఖ అసిస్టెంట్ మేనేజర్ ఎస్.నాగేశ్వరరావు అన్నారు. యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యాన గురువారం వ్యక్తిత్వ వికాసం, కేరీర్ గైడెన్స్ అనే అంశంపై కొత్తపేటలోని హిందూ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంచి స్నేహితులు, ఆలోచనలు విద్యార్థులను విజయం వైపు నడిపిస్తాయని చెప్పారు. మానసిక వికాస నిపుణులు ఏఎం జయరత్నం, శ్రీపతి జగదీష్ మాట్లాడుతూ లక్ష్యసాధనకు కోపం, అసూయ, బద్ధకం, ప్రతీకారం వంటి విషయాలను విడిచి పెట్టాలన్నారు. జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి మాత్రమే చరవాణిని వాడాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు కంచర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం యువజన సర్వీసుల శాఖ ద్వారా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు జూపూడి ఆనందకుమార్, చిట్టా రాజశేఖర్, ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

త్వరగా భూముల సరిహద్దు రాళ్లు పాతండి

కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రీ సర్వే చేసిన భూముల్లో సరిహద్దు రాళ్లు పాతే కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్షా పథకంలో భాగంగా చేపడుతున్న భూముల రీసర్వేలో సరిహద్దు రాళ్లు పాతే ప్రక్రియపై గురువారం జేసీ శ్రీవాస్ నుపూర్ అజయ్, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు సర్వేయర్లతో కలెక్టర్ ఢిల్లీరావు గూగుల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 14 గ్రామాల్లో భూముల రీసర్వే ప్రక్రియను చేపట్టి పూర్తి చేస్తారన్నారు. రీ సర్వేలో భాగంగా సరిహద్దు రాళ్లు పాతే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. జగ్గయ్యపేట మండలం షేర్ మహమ్మద్ పేట గ్రామంలో సరిహద్దురాళ్లు పాతడం పూర్తైందన్నారు. మిగిలిన 13 గ్రామాల్లో భూముల సరిహద్దు రాళ్లు పాతాల్సి ఉందన్నారు. ఇప్పటికే సిద్ధంగా ఉన్న 23 వేల సరిహద్దు రాళ్లను ఆరు వారాల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ సెక్షన్ పరిధిలోని 11కేవీ కలరా హాస్పటల్ ఫీడర్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8నుంచి 10గంటలవరకు సయ్యద్ అప్పలస్వామి కళాశాల వెనుక, పాలఫ్యాక్టరీ ప్రాంతం, లంబాడీపేట, సాయిరామ్ థియేటర్ ఎదురుగా, అలీనగర్, కలరా హాస్పటల్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు.

నాన్ ఆపరేషన్ యూనిట్ సమస్యలు పరిష్కరించండి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నాన్ ఆపరేషన్ యూనిట్లలో సమస్యలను పరిష్కరించాలంటూ ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ సభ్యులు విద్యాధరపురంలోని ఆర్టీసీ జోనల్ వర్క్‌షాప్ గేట్ ముందు గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన తెలియ చేశారు. నాన్ ఆపరేషన్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, కల్యాణ్‌కుమార్, జోనల్ వర్క్‌షాప్ అధ్యక్ష, కార్యదర్శులు స్వామి, సీహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సేవలందించడం అభినందనీయం

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



తోపుడు బండి అందజేస్తున్న వెలంపల్లి, భాగ్యలక్ష్మి, మాధురీలావణ్య తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): పేదలకు సేవలందించడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యాధరపురం కబేళా సెంటర్‌లోని ఆమె కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. పేదలకు మూడు నాలుగ చక్రాల తోపుడు బళ్లు, ఒక మూడు చక్రాల బండితోపాటు సుమారు 200 మంది పేద మహిళలకు చీరెలను ఎమ్మెల్యే వెలంపల్లి చేతుల మీదుగా అందచేశారు. కార్యక్రమంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మైలవరపు కృష్ణ, దుర్గ గుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, సభ్యులు కట్టా సత్తెయ్య, కార్పొరేటర్లు మైలవరపు రత్నకుమారి, బాపతి కోటిరెడ్డి, యరడ్ల ఆంజనేయరెడ్డి, ఎండీ ఇర్ఫాన్, పడిగపాటి చైతన్యరెడ్డి, గుడివాడ నరేంద్ర రాఘవ, అత్తలూరి ఆదిలక్ష్మి, మరుపిళ్ల రాజేష్ పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు



కొబ్బరి కాయలు కొట్టే కౌంటర్‌లో సిబ్బందికి సూచనలు ఇస్తున్న చైర్మన్, ఈఓ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మల్లేశ్వరస్వామి దర్శనానికి విచ్చేసే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ అధికారులను ఆదేశించారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద జరుగుతున్న పనులను గురువారం చైర్మన్, ఈఓ, ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించారు. క్యూలైన్లు, మంచినీటి సదుపాయంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాలని సూచించారు. ప్రత్యేకంగా క్యూలైన్లతో పాటు షామియానాలు ఏర్పాటు చేయనున్నామని ఈఈ కోటేశ్వరరావు పేర్కొన్నారు. అనంతరం భక్తులు కొబ్బరి కాయలు కొట్టే ప్రాంతంలో సిబ్బందితో మాట్లాడారు. కొబ్బరి కాయలు కొట్టేందుకు డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, అటువంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉచిత ప్రసాద వితరణ, స్వామి వారి బాలాలయం పరిసరాలు పరిశీలించారు.

పొంగలిషెడ్డును వినియోగంలోకి తీసుకురావాలి

భక్తులు అమ్మవారికి పొంగలి నైవేద్యం వండేందుకు సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని చైర్మన్ కర్నాటి రాంబాబు ఇంజినీరింగ్ అధికారులతో పేర్కొన్నారు. ఘాట్‌రోడ్డులోని ఓం వద్ద నిరుపయోగంగా ఉన్న షెడ్డులో వెంటనే గ్యాస్ పొయ్యిలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పొయ్యిలు ఏర్పాటు చేసి తగినంత సిబ్బందిని నియమిస్తామని ఈవో భ్రమరాంబ, ఈఈ కోటేశ్వరరావు పేర్కొన్నారు. చైర్మన్ వెంట పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య, నంబూరి రవి, వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝల శ్రీనివాసశాస్త్రి, ఏఈవో ఎన్. రమేష్‌బాబు, బి.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషను పరిరక్షించుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రపంచభాషల్లో గొప్ప పదసంపద కలిగిన తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డాక్టర్ సామల రమేష్ బాబు అన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం తెలుగు విభాగం ఆధ్వర్యాన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం పురస్కరించుకుని ‘మాతృభాష – శాస్త్రీయ అధ్యయనం – సాంకేతిక అవసరాలు’ అనే అంశంపై ప్రసంగం కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ మాతృభాషలో ప్రావీణ్యం పొందినప్పుడే పరాయి భాషలను సులువుగా నేర్చుకోగలరని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ తల్లి ప్రేమలా మాతృభాష కూడా తియ్యనైనదని, తెలుగువారు ఎక్కడ ఎదురుపడినా తెలుగులోనే సంభాషించుకోవాలన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



లబ్ధిదారునికి ఎల్‌ఓసీ పత్రాలను అందిస్తున్న వెలంపల్లి, కార్పొరేటర్ రాజేష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో వైద్య, ఆరోగ్య రంగాలకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. చిట్టినగర్ ప్రాంతానికి చెందిన గర్రె శివ నాగేంద్ర బాబు గుండె సంబంధించి వ్యాధితో కొన్ని రోజులుగా బాధపడుతున్నారు. ఆపరేషన్ చేయాలని వైద్యులు చెప్పడంతో వారు విషయాన్ని ఎమ్మెల్యే వెలంపల్లి తెలియజేయగా వెంటనే స్పందించారు. ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆపరేషన్‌కి అయ్యే ఖర్చు మంజూరు చేసేందుకు హామీఇచ్చారు. వాటికి సంబంధించిన ఎల్‌ఓసీ పత్రాలను గురువారం ఆయన కార్యాలయంలో బాధిత కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్, శ్రీశైలం దేవస్థానం పాలకమండలి సభ్యులు గురుమహంతు మహేష్, పాతశివాలయం మాజీ డైరెక్టర్ పణుకు ఫణి తదితరులు పాల్గొన్నారు.

వెలగలేరు వెళ్లిన 51వ డివిజన్‌వాసులు

నియోజకవర్గంలోని 51వ డివిజన్‌కు చెందిన జగనన్న ఇళ్ల లబ్ధిదారులు గురువారం వెలగలేరు వెళ్లి వారి స్థలాలను చూసి వచ్చారు. స్థానిక కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ స్థానిక లబ్ధిదారులను ప్రత్యేక వాహనాల్లో తీసుకెళ్లి వారివారి స్థలాలను చూపించారు.

• పుస్తక ప్రియుల జాతర



పుస్తక ప్రియుల రాకతో నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణం జాతరగా మారింది. పుస్తక మహోత్సవ ప్రాంగణంలోని స్టాళ్లు పిన్న, పెద్దతో సందడి కనిపించాయి. వారు పుస్తకాలు ఆసక్తిగా గమనించారు. అవసరమైన పుస్తకాలను కొనుగోలు చేశారు. సాహితీ సదస్సులు, పుస్తకావిష్కరణలు జరిగాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

